# ధర్మపురి నియోజకవర్గానికి రూ.15 కోట్లు మంజూరు

- 277 పనులకు కేటాయింపు
- మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడి

ధర్మారం, అక్టోబర్ 5 : ధర్మపురి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.15 కోట్ల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర ప్లానింగ్ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ కే రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ధర్మపురి, బుగ్గారం, వెల్గటూరు, ఎండపల్లి, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లో 203 అభివృద్ధి పనులకు రూ.11కోట్ల 24 లక్షల 20 వేలు, ధర్మారం మండలంలోని 74 పనులకు రూ.3 కోట్ల 75 లక్షల 80 వేల చొప్పున మంజూరైనట్లు వివరించారు. త్వరలో ఈ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.



మానాలలో పోడు భూములకు పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

# కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దు

- వారు చెప్పేవన్నీ అబద్ధాలే
- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- మానాలలో 762 మంది గిరిజనులకు పోడు పట్టాలు

రుద్రంగి, అక్టోబర్ 5: 'ఇన్నాళ్లూ కనిపించని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్నికలు వస్తున్నాయని గ్రామాల మీదపడ్డరు. అసత్య ప్రచారం చేస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నరు. వారు చెప్పేవన్నీ అబద్ధాలే. నమ్మితే మోసపోతం' అంటూ రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. తెలంగాణ రాక ముందు మీ గ్రామం ఎట్లుండే.. ఇప్పుడెట్ల అభివృద్ధి జరిగిందో చూడాలని, ఆలోచించి ఓటు వేయాలని కోరారు. గురువారం రుద్రంగి మండలం మానాలలో 762 మంది గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడారు. మానాల, గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని, పోడు భూములకు పట్టాల పంపిణీతో గిరిజనులకే పూర్తి హక్కులు లభించాయని చెప్పారు. 'తండాలను గ్రామపంచాయతీలుగా చేసి మీ తండాలో మీకే పాలన అప్పగించిన ఘనత కేసీఆర్‌దే' అని కొనియాడారు. మారుమూల గ్రామమైన ఒక్క మానాల గ్రామం నుంచే 8 నూతన గ్రామపంచాయతీలు ఏర్పడడం చాలా గొప్ప విషయమన్నారు. ఉమ్మడి మానాల పరిధిలో 762 మంది గిరిజనులకు 1750 ఎకరాల్లో పోడు భూములకు పట్టాల పంపిణీ చేసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. అనంతరం బతుకమ్మ చీరలు, గ్రామీణ క్రీడల కింద అన్ని గ్రామాలకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు తొట్టిపాటి నరసింహనాయులు, ఆర్డీవో మధుసూదన్, నిజామాబాద్ డీసీసీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారీ, ఎంపీపీ గంగం స్వరూపారాణి, కమ్మర్‌పల్లి జడ్పీటీసీ రాజాగౌడ్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శంకర్, సీఐ కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ పీసరి భూమయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేగావత్ తిరుపతి, ఎంపీటీసీ గుగులోత్ గంగిబాయి, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# 7న కేబుల్ బ్రిడ్జిపై మెగా డ్రోన్ షో





- కరీంనగర్‌లో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం
- ఒకేసారి 450 డ్రోన్లతో ఆకాశంలో అద్భుతమైన ప్రదర్శన
- 100 మీటర్ల ఎత్తులో అభివృద్ధి కాంతులు

కార్పొరేషన్, అక్టోబర్ 5: కరీంనగర్ వాసులకు అభివృద్ధితోపాటు ఆహ్లాదాన్ని అందించేందుకు మంత్రి గంగుల కమలాకర్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహా నగరాల్లో మాత్రమే ఏర్పాటు చేసే డ్రోన్ షోను, ఈ నెల7న కేబుల్ బ్రిడ్జిపై నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. శనివారం సాయంత్రం 6.30గంటలకు ఒకేసారి 450 డ్రోన్లతో ఆకాశంలో అద్భుత ప్రదర్శన ఇవ్వనున్నారు. కరీంనగర్ సాధించిన అభివృద్ధిని కళ్లకు కట్టేలా.. జిగేల్ మనిపించేలా ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు సినీ సంగీత విభావరి, అనేక సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహించనున్నారు. ఇప్పటికే 'వీకెండ్ మస్తీ' పేరిట గతంలో నిర్వహించిన కార్యక్రమాలకు తోడుగా సరికొత్తగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# కరీంనగర్‌లో ఇస్కాన్ ఆలయం

- సీఎం కేసీఆర్ సహకారంతో మూడెకరాల స్థలం
- మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్‌లో ఇస్కాన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 5: కరీంనగర్‌లో గొప్ప శ్రీకృష్ణుడి క్షేత్రాన్ని నిర్మించి ఆధ్యాత్మికతకు నిలయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో రూ. 20 కోట్లతో ఆలయాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. హరే రామ హరే కృష్ణ, ఇస్కాన్ ప్రతినిధులతో గురువారం మంత్రి గంగుల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కరీంనగరానికి ఓ వైపు టీటీడీ శ్రీవారి ఆలయం, మరో వైపు ఇస్కాన్ ఆలయంతో నగరం ఆధ్యాత్మిక కేంద్రంగా వెల్లివిరియనున్నాయన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మికత, భక్తిభావం పెంపొందినప్పుడే... భయం పెరిగి.. క్రమశిక్షణ అలవడుతుందన్నా రు. ఇందుకోసం ఏటా కరీంనగర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుపుకుంటున్నామని చెప్పా రు. నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో గొప్ప క్షేత్రాన్ని నిర్మిస్తున్నామని, ఇప్పటికే సీఎం కేసీఆర్ 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారని చెప్పారు. 15 రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కరీంనగర్ అభివృద్ధే కాదు, నగరం ఆధ్యాత్మికతలో ముందుండాలని, ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించాలని, డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి పూనుకున్నామన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్ మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించారని వెల్లడించారు. ఆలయ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, శనివారం తెలంగాణ చౌక్ నుంచి ఆలయాన్ని నిర్మించే ప్రతిపాదిత స్థలం వరకు, హరే రామ హరే కృష్ణ అధ్వర్యంలో రాధ గోవిందుడి శోభాయాత్రను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ విదేశీయులు, కృష్ణుడి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని పేర్కొన్నారు. నగరవాసులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, హరే రామ హరేకృష్ణ ప్రతినిధులు నరహరి స్వామి, బుర్ర మధుసూధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నరేశ్ రెడ్డి, రాజభాస్కర్ రెడ్డి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఎన్నికల ప్రచారం



కాల్వశ్రీరాంపూర్: అంకంపల్లిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కి బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళ

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్ 5: 'తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధి మీకండ్ల ముందరే ఉన్నది.. ఇచ్చిన హామీలను నెరవేర్చినందునే ఇప్పుడు మీ వద్దకు వచ్చినం..చేసిన పనులను చూసి ఆశీర్వదించండి' అంటూ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కాల్వశ్రీరాంపూర్ మండలంలోని అంకంపల్లి, మడిపల్లికాలనీ, మడిపల్లి, ఆశన్నపల్లెలో ఇంటింటా ప్రచారం చేశారు. అంకంపల్లిలో చీరలు, మండల పరిషత్ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. మహిళలు నుదట తిలకందిద్ది ఆశీర్వదించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్ధానాలను నమ్మవద్దని కోరారు. అరవై ఏండ్లలో జరగని అభివృద్ధిని తొమ్మిదేండ్లలోనే చేసి చూపించామన్నారు. నియోజకవర్గంలో రోడ్లు , డ్రైనేజీలు కల్వర్టులతో పాటు ఇతర పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతల కల్లబొల్లి మాటలను నమ్మితే నిండా మునగడం ఖాయమన్నారు. ఊర్ల కు వచ్చే ఆ పార్టీ నాయకులను నిలదీయాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి పెద్దపల్లి గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలని విజ్ఞప్తిచేశారు. కాగా. మండలంలోని మొట్లపల్లిలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి ఎమ్మె ల్యే భూమిపూజ చేశారు. పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని సర్పంచ్ గోనే శ్యాం కు సూచించారు. అలాగే తారుపల్లి, పెగడపల్లి గ్రామాలకు చెందిన 83మందికి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ జాహెద్‌పాషాతో కలిసి ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచులు ఆకుల చిరంజీవి, తీగల స్వప్న నాగరాజు, గోనే శ్యాం, ఆడెపు శ్రీదేవి రాజు, ఎంపీటీసీలు పెండ్లి సంపత్, బొల్లమల్ల కౌసల్య, బీఆర్ఎస్ మం డలాధ్యక్షుడు గొడుగు రాజ్‌కుమార్ , ఆర్బీఎస్ మండల కన్వీనర్ నిదానపురం దేవయ్య పాల్గొన్నారు.

# పదేళ్ల పాలనలో వందేళ్ల ప్రగతి

- ఎమ్మెల్యే కోరుకంటిచందర్



ఈసాలతక్కళ్లపల్లిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

పాలకుర్తి, అక్టోబర్ 5 : పదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ వందేళ్ల ప్రగతిని సాధించిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. గురువారం పాలకుర్తి – ఈసాల తక్కళ్లపల్లి వరకు రూ.60 లక్షలతో సిమెంటు రోడ్డు, రామారావుపల్లి మహిళా సంఘ భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈసాల తక్కళ్లపల్లిలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించి, బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో గ్రామ గ్రామాన కుల సంఘాలకు సామూహిక భవనాలు, సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. మహిళా సంక్షేమానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో ఉన్న పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా ఒక పెద్దన్నలాగా కేసీఆర్ చీరెల పంపిణీ చేస్తున్నారని, ఈ సాంప్రదాయం 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వ్యాళ్ల అనసూర్యారాంరెడ్డి, వైస్ఎంపీపీ ఎర్రం స్వామి, సర్పంచ్‌లు కట్టెకోల వేణుగోపాల్‌రావు, దుర్గం జగన్, షేర్ల లక్ష్మీపతి, మల్లెత్తుల శ్రీనివాస్, కోఅప్షన్ సభ్యుడు సర్వర్, ఏఎంసీ చైర్మన్ అల్లం రాజయ్య, సీనియర్ నాయకులు కౌశికహరి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.